

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 22 సెప్టెంబర్, 2024 సంచిక : 4

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**

2 సంవత్సరాలకు చందా........రూ॥200/-
10 సం.రాలకు చందా........ రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

| **విషయసూచిక** | **పుట సంఖ్య** |
|---|---|
| మా వాణి | 2 |
| జ్ఞానోదయమే జీవనసాఫల్యము | 4 |
| సాయిభక్త దాసగణు | 7 |
| శాశ్వత ధర్మగోప్త | 10 |
| మృత్యుముఖం నుండి | 12 |
| శ్రీ సాయి నిత్య పారాయణ | 15 |
| గురువు-సాధన | 17 |
| మాతృసంస్థ కబుర్లు | 20 |
| నవ్వుకు ఏది కారణం | 23 |
| విధిని మార్చటం సాధ్యమా | 25 |
| ఆ ఆత్మే నీవు | 27 |
| ఆశ్రమ భిక్ష | 31 |
| సాధకులకు ఆహ్వానం | 32 |

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



సాయి బంధువులందరికీ నమస్సుమాంజలి.

ఈ మధ్యనే నిర్వహణాధికారులు మన ఆశ్రమ సందర్శనానికి వచ్చారు. వారి వారి తావులలో వారు ఎదుర్కొనే యిబ్బందులు, విధర్మీయులు వలన ఇక్కట్లు, ఆధిపత్యం కోసం కొట్లాటలు మొదలైన వాటిని గూర్చి చర్చ వచ్చింది. దానిలో విన్నవన్నీ మా అనుభవాలతో కలుపుకుంటే చిత్రంగా తోచింది. తుఫానులు కల్పించేదే ఆయనే. అవి ఆపి రక్షించేదీ ఆయనే. అవి ఆపి రక్షించేదీ ఆయనే అయినా ఈలోపల ప్రకృతి అతలాకుతలం కాక తప్పదు గదా! సేవా రంగం ముళ్లపానుపేననీ, ఇది నిరంతర సమస్యా తోరణాన్ని తగిలించుకోవటానికి సంసిద్ధమైన ముంగిలిలాంటిదేననీ తెలిసే దిగినా-మానవ నైజాన్ని దాటి వెళ్లలేని అశక్తత వలన ఎక్కడో మనస్సు చివుక్కుమనక మానదు.

'మేమున్నాం' అని తోడు నిలిచే కార్యకర్తల సంఖ్య చాలినంతగా లేక పోవటం-రోజురోజుకీ కొరవడిపోతున్న పని వాళ్ల సంఖ్య- క్షణక్షణంగా పెరిగిపోతున్న ధరలు, బరువవుతున్న నిర్మాణాలు, నిర్వహణలు, దొరకని యోగ్యులైన పూజారులు, అనుకొన్న రీతిలో నడవని శిష్యులు, చెయ్యాలను కున్నంతగా చెయ్యలేక ఇంకా మిగిలిపోతున్న సేవా కార్యక్రమాలు, యివన్నీ మామూలు సమస్యలు. అయితే వీటన్నిటికీ పరిష్కారంగా ఆర్థిక పరిపుష్టి ఏర్పడితే సరిచేసుకోవచ్చు కానీ -

బల్లెంలా గుచ్చుకొనేది విశ్వాసరాహిత్యం. 'ఆశ్రమం నాకేమి చేసింది?

అని కాక ఆశ్రమానికి నేనేం చేసాను?' అని ఆలోచించలేని స్వార్థం. 'ఆకాశానికి ఉమ్మి వేస్తే మన ముఖానే పడుతుంద'ని గ్రహించలేని మూర్ఖత్వం. ఏ దిక్కూ లేని వాళ్లమని వచ్చి, ఆషాఢభూతుల్లాగా ఉండి, చివరికి తమ బలహీనతలు బయటపడగానే తరలిపోయే జీవుల ధూర్తత, క్షణక్షణం తమ కష్టాలు చెప్పకొని వీలైనంత రాబట్టుకొనే సోమరుల వంచనా శిల్పం, అవసరం తీరేవరకు, ఒడ్డు చేరేవరకూ ఓడ మల్లయ్య, చేరాక బోడి మల్లయ్య అనే ధోరణులు, కపటంతో ఆశ్రమాలను వాడుకొని తమ పరపతి పెంచుకోవాలనుకొనే వంచన, నిన్న మనం చూపిన ప్రేమకూ ఇవ్వేళ కక్కే విషానికీ పొంతన ఉన్నదా?" అని ఆలోచించే పాటి వివేకం లేని అహంకారాలు, ఇవన్నీ కలిసి సేవకులను, వారి ఏకదీక్షను ఛిన్నాభిన్నం చేసే ప్రయత్నం చేస్తుంటాయి. అప్పడప్పడూ దాని వలన కొద్దికాలం పనిచేసే వారి మానసిక శక్తులు కుంటుపడతాయి. అయినా గానీ పరమాత్ముని రక్షా హస్తం కాపాడుతుందన్నది నిర్వివాదం. "నీ మీద లోకం దుమ్మెత్తి పోస్తోందా? అయితే నీవు నిర్వీర్యంగా ఉండక పనిచేస్తున్నా ననే అర్థం" అన్నారు స్వామీ వివేకానంద. "నావైపెందుకు అంత ద్వేషంగా చూస్తున్నావు? నేనెప్పడూ నీకు మేలు చేసిన గుర్తు లేదే!" అన్నది ఒక ఫ్రెంచి సామెత. ఈ విషయాలే ఆ విషయాలే గురువుగారు వివరించి చెప్పి, వారందరికీ సాంత్వన కలిగించారు. అందుచేత 'ప్రియ మిత్రులారా, ఆశ్రమాలన్నిటి క్షేమం కోసం, మాతో కలిసి శ్రీ సాయినాథుని ప్రార్థించండి- "పృథ్వీతలంలోని కష్టాలన్నీ మాకివ్వు స్వామీ! దాని వలన లోకమంతటికీ బాధా విముక్తి కలగనీ. కానీ, నీవు మాపై పెట్టిన బరువు మోసే శక్తిని మాత్రం నీవే ప్రసాదించు తండ్రీ".





# జ్ఞానోదయమే జీవన సాఫల్యము

- వల్లభనేని కుటుంబరావు

**(గత సంచిక తరువాయి)**

దీనిని బుద్ధుడు ధ్యానంలో మెత్త అంటే సానుకూల భావన మొదట పంపించమంటాడు. తర్వాత ప్రేమ, కరుణ, దయ భావాలని, ప్రకంపన లను పంపించమంటాడు. దీనివలన మన హృదయం పవిత్రం అవుతుందంటాడు.

## 3.0 జ్ఞాన సాధన క్రియలు

మనిషికి సత్వ, రజ, తమో గుణాలను అనుసరించి శ్రద్ధలు వేరు వేరుగా ఉంటాయి. సాత్విక శ్రద్ధ, రాజసిక శ్రద్ధ, తామసిక శ్రద్ధ. శ్రద్ధలకు అనుగుణంగా వారి వారి పనులు చేస్తూ ఉంటారు.

ఇది నిషిద్ధం అని చెప్పినా అవి చేయటం అధర్మం. అధర్మాన్ని ఆచరించే మానవుల శ్రద్ధ భిన్నంగా ఉంటుంది. శ్రద్ధయే భిన్నంగా ఉండటం వలన కర్మఫలాలు భిన్నంగా ఉంటాయి. పునర్జన్మలు భిన్నంగా ఉంటాయి, ఆలోచనలు భిన్నంగా ఉంటాయి.

ఇదే పునర్జన్మలకు కారణం. ప్రపంచ విషయాల వైపు, సుఖం వైపు, భోగాల వైపు పరుగులు తీస్తే జన్మలు పెరుగుతాయి.

అదే సాత్వికంగా, ధర్మబద్ధంగా, జ్ఞానమార్గాన నడిస్తే జన్మలు తగ్గుతాయి. ముక్తి లభిస్తుంది. ఇది వారి, వారి జన్మ జన్మల సంస్కారాన్ని బట్టి ఉంటాయి. సంస్కారాన్ని సవరించుకోవటమే మనం ఈ జన్మలో చేయవల్సింది. దానికి శ్రద్ధ, సహనం చాలా అవసరం అనేది మీరు గ్రహించాలి. శ్రద్ధను, సహనాన్ని, మౌనాన్ని సాధన చేయండి. శ్రద్ధాన్ లభతే జ్ఞానం అన్నారు శ్రీకృష్ణులు. శ్రద్ధ లేకుండా జ్ఞానం లభ్యం కాదు.

ఈ ప్రపంచం అంతా కేవలం కాస్మిక్ ఎనర్జీ. అయితే కాస్మిక్ ఎనర్జీ వివిధ లెవెల్స్, భిన్న వైబ్రేషన్స్, ఫ్రీక్వెన్సీలలో ఉంటుంది.

లక్షల మంది ఎందరో గురువుల ప్రసంగాలు వింటారు. ఎందరిలో మార్పు వస్తుంది? ఇలా వింటారు, హాలు నుంచి బయటకు వెళ్ళగానే ఆకలితో అలమటించే బిచ్చగాడుంటాడు. పైసా ఇవ్వరు, వెళ్ళిపోతారు. మరి విని, ఆచరించనప్పడు ఉపయోగం ఏమిటి? కోపం కూడా అంతే, నేను శాంతంగా ఉండాలి అని ప్రసంగం వింటున్నప్పడు అనుకొంటారు. ఇంటికి వెళ్ళిన తర్వాత పొరపాటున కూరలో ఉప్ప ఎక్కువైతే కోప్పడతారు. సర్దుకు పోలేరు. ఒకరోజు ఫర్వాలేదు, అనుకోలేరు. ఎందుకని అంటే, ఈ జ్ఞాన బోధనలన్నీ మనసు వరకే వెళ్ళతాయి. అంటే మనోస్థాయి వరకే వెళతాయి. ఎప్పడయితే హృదయస్థాయి వరకు చేరతాయో అప్పడు మనిషిలో ఖచ్చితంగా సంస్కారంలో మార్పు వస్తుంది. షిరిడీసాయి బాబా ఆయన శిష్యులకు ప్రవచనాలు చెప్పలేదు, మంత్రాలు ఇవ్వలేదు, పురాణాలు, భాగవతాలు చెప్పలేదు. ఆయన ఆత్మస్థాయిలో శిష్యులకు కమ్యూనికేట్ చేసేవారు. ఒకసారి, ఒక శిష్యుడు నాకు మంత్రం చెప్పండి అంటే ఆయన గురువు వెంకుస నాకే మంత్రం బోధించలేదు. ఆయన చూపు, ఆయన దగ్గర ఉండటమే నాకు తెలుసు. అంతా ఆయనే చూసుకొనేవారు. నాకు జ్ఞానబోధ చేయలేదు అన్నారు.

మా గురువుగారు నాకు ఏ మంత్రం చెప్పలేదు, ఉపనిషత్‌లు, భాగవతం చెప్పలేదు. కేవలం ఆయన చూపు, ఆయన సాన్నిధ్యంలో ఉన్నంత సమయం నాలో అంటే నా ఆలోచనలలో, ప్రవర్తనలో, నా మాటలలో మార్పును గమనించాను. ఆయన ఆత్మ లెవెల్లో చేసేవారు. ఒక్కొక్కసారి ఇది అవసరమా అనే వారు. అది నాకు తప్పితే ప్రక్కనున్న వారికెవ్వరికీ అర్థమయ్యేది కాదు. నాకు మట్టుకు అర్థమయ్యేది, నేనేం చేశాను, అలా చేయకూడదు అని ఆత్మస్థాయిలో అర్థమయ్యేది. వెంటనే అవును గురువు





గారు, ఇక చేయను అనేవాడిని. మేగ్జిమమ్ 12 సంవత్సరాలలో డైరెక్టుగా చెప్పింది. ఒక్క మాట, నువ్వు రేపటి నుంచి మాంసాహారము తినడం మానేస్తున్నావు అన్నారు. నేను అవును మానేస్తాను, సందేహం లేదు అన్నాను. ఇది మీరు నేర్చుకోవల్సింది. గురువు చెప్పింది శాసనంగా ఆచరించటం.

ఈ కాస్మిక్ ఎనర్జీ లెవెల్ హెచ్చుస్థాయిలో ఉన్న శిష్యులకు ఆత్మస్థాయిలో ఉపదేశాలు వెళ్ళి ఆచరణలో పెట్టి వాళ్ళు అభివృద్ధి మార్గంలో వెళుతుంటారు. మీడియమ్ ఎనర్జీ లెవెల్ ఉన్నవారు వాళ్ళకు ఇష్టమైన వాక్యాన్ని మాత్రమే ఆత్మస్థాయిలోకి తీసుకెళ్ళడంతో కొంతవరకే మార్పు ఉంటుంది.


ఇంక లో ఎనర్జీ లెవెల్ వున్న వారికి ఉపదేశాలు మరీ లోస్థాయిలో ఉంటాయి. ఆచరణ మార్పులు శూన్యం.

సత్యసాయి, షిరిడీ సాయి కేవలం శిష్యులవైపు అనుగ్రహం చూపు ప్రసరణతో శిష్యులలో మార్పు చేసేవారు. వారు ఏ మంత్రం చెప్పలేదు. గురువు అనుగ్రహం అలా ఉంటుంది. గురువు అనుగ్రహం, ప్రేమ పొందటం పూర్వజన్మ సుకృతమే. అందుకే షిరిడీసాయి ఎంత గొప్ప సందేశం చెప్పారంటే శిష్యునకు "తల్లి తాబేలు గురువు, పిల్ల తాబేలు శిష్యుడు. తల్లి తాబేలు సృష్టిలో తమ పిల్లలకు ఆహారం పెట్టదు, పాలివ్వదు. కేవలం తల్లి తాబేలు తన చూపుతో పిల్లలను పెంచుతుంది. ఇది సృష్టి రహస్యం. గురువు అంతే" అన్నారు షిరిడీ సాయిబాబా.

ఒకసారి షిరిడీ సాయిబాబా శిష్యులతో నా దగ్గర ధన భాండాగారము పొంగిపోతోంది. శిష్యులను మీక కావాల్సినంత తీసుకుపోండి అన్నా ఎవరూ తీసుకోవట్లేదు అన్నారు.

అంటే ఆయన ఉద్దేశ్యం ధనం కాదు, దైవీ సంపద. అంటే జ్ఞానం చాలా ఉంది. ఏ శిష్యుడూ నాకు జ్ఞానం బోధించండి అని అడగట్లేదు. వాళ్ళు ప్రపంచ సుఖాల కోసం, కోరికలతో వచ్చి పోతున్నారు. నాకు బాధగా ఉంది అన్నారు.

**(సశేషం)**



# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

అనంత పరబ్రహ్మ అపార కారుణ్యమూర్తిగా శ్రీ సాయి రూపంలో మనకు లభించినప్పుడు, **"మీరు ఊరక కూర్చోండి, చేయవలసినదంతా నేను చేస్తాను"** అనే అపూర్వమైన భరోసాను ప్రసాదించినప్పుడు, ఆ రూపాన్ని భక్తిప్రేమలు నిండిన కళ్ళతో చూస్తూ ఉండటం తప్ప, మనం చేసే అనుష్టానాలూ, పూజా విధులు ఏముంటాయి? సరి!

దాసగణు ప్రతిరోజు **"అమృతానుభవ భావార్ధ మంజరిని"** వ్రాయడానికి ఉద్యుక్తడవడం, కానీ, భావ సంక్లిష్టత మూలాన ఉదాసీనుడవడం, అప్పుడు బాబాను శరణు వేడుటానికై మసీదుకు రావడం, బాబా సరిగ్గా ఆ సమయంలోనే - అక్కడ కూర్చొన్న వారి దృష్టిలో-ఏదో ఒక పొంతన లేని కథ చెప్పడం, దాసగణుకు అప్పటి వరకు బోధపడని ఓవిలలోని నిగూఢతను విశదపరచే విషయం ఆ కథలో ఉందని దాసగణుకు స్ఫురించడం, ఫలితంగా భావ సంక్లిష్టత తొలగిపోవడం, వెంటనే ఎనలేని ఉత్సాహవంతుడై అద్భుతంగా ఆ ఓవిలకు వ్యాఖ్యానం వ్రాయడం ... అనే రీతిలో దాసగణు రచన కొనసాగింది.

దాసగణుకు అమృతానుభవం వ్రాసేటప్పుడు ఏ ఓవిలో ఎటువంటి సంక్లిష్టత కలిగిందో, బాబా ఏ కథ చెప్పి, సంక్లిష్టతను దూరం చేసారోననే విషయాలు ఒకటి, అరా మినహా మనకు పూర్తిగా లభ్యం కావడం లేదు. అవన్నీ రికార్డు అయిన దాఖలాలు కూడా మనకు లభించడం లేదు. మనకు ఉపలబ్ధంగా నున్న కొద్దిపాటి సమాచారాన్ని సావధాన చిత్తంతో వివేచించి, శ్రీ సాయి నుడివిన బోధామృతాన్ని గ్రోలేందుకు ఆయత్తమవుదాం!

దాసగణు యొక్క గ్రంథ రచనా ప్రక్రియ ఆ విధంగా జరుగుతున్నప్పుడు,





ఒకరోజు శ్రీ బాపూ సాహెబ్ బూటీ ఏదో విశేష సందర్భాన్ని పురస్కరించుకొని, పెద్దఎత్తున "శిరా" ప్రసాదాన్ని చేయించి, భక్తులందరికీ పంచుతున్నారు. రాధాకృష్ణాఆయి విషయానికి సంబంధించి దాసగణుకు, బూటీకి సత్సంబంధాలు లేవని మనం ముందర ప్రస్తావించుకున్నాం. అందువలన దాసగణు ఆ శిరా ప్రసాదాన్ని భుజించడానికి వెళ్ళలేదు. విఠ్ఠల మందిరంలో కూర్చొని తన రచనా ప్రక్రియను కొనసాగిస్తున్నాడు. అప్పడు, "అమృతానుభవం"లోని రెండవ అధ్యాయంలో కొంచెం భావ సంక్లిష్టత ఎదురైంది. యథాప్రకారం బాబా సహాయానికై మసీదుకు వెళ్ళాడు. బాబా చరణాలకు నమస్కరించుకొని బాబా సమీపంలో కూర్చొన్నాడు. అప్పడు బాబా **"ఏం గణూ, శిరా తినడానికి నీవు వెళ్ళలేదా?"** అని అడిగారు. "లేదు బాబా, ఆ వ్యక్తితో నాకు పడదు. అందుకే వెళ్ళలేదు" అని దాసగణు సమాధానమిచ్చాడు.

అప్పడు, ఎంతో గొప్ప వేదాంత సత్యాలు కలిగిన నిగూఢమైన మాటలు బాబా ముఖతః వెలువడ్డాయి. "ఎవరు ఎవరికి ఇస్తున్నారు? ఈ "శిరా" ఏమిటి? భుజించేవారు ఎవరు? ఎవరినీ శత్రువులు అని అనవద్దు. ఎవరు ఎవరికి శత్రువు? ఎవరి పట్ల శత్రుభావం కలిగియుండవద్దు. అందరూ ఒకటే!" అనేవి బాబా ముఖతః వెలువడిన మాటలు!

బాబా మాటలలో ఎన్నో అమూల్యమైన ఆధ్యాత్మిక సత్యాలు దాగియున్నాయి. ఈ జగమంతా ఈశ్వరుని (భగవంతుని) స్వరూపం. అన్నీ రూపాలలో ఆయనే నడయాడుతున్నాడు. ఆయన కానిదీ, ఆయన లేనిదీ ఏదీ లేదు. మరటువంటప్పడు "శిరాను పంచే భక్తుడు ఆ భగవంతుని స్వరూపుడే", అలాగే ఆ "శిరాను స్వీకరించే భక్తుడూ ఆ భగవంతుని స్వరూపుడే!" అసలు ఆ "శిరా కూడా భగవంతుని స్వరూపమే!" మరటువంటప్పడు "ఇచ్చేది ఎవరు, తీసుకునేది ఎవరు? పంచే శిరా ఏమిటి? అంటే అంతా ఆ భగవంతుడే!" **"ఎవరు, ఎవరికి ఇస్తున్నారు? ఈ శిరా ఏమిటి? భుజించేవారు ఎవరు?"** అనే బాబా మాటలలోని అంతరార్థం అదే! ఆ భగవంతుడు ఒక్కడే మన శరీరాల మాధ్యమంగా నడయాడుతున్నప్పడు, మనం ఒకరి పట్ల ఒకరం శత్రు భావం కలిగియుండటం అంటే, బింబం

ప్రతిబింబంతో శత్రుభావం కలిగియుండటం వంటిది. సర్వం భగవంతుడే అయినప్పుడు, అందరూ ఒక్కటే కదా! ఆ దృష్ట్యా ఎవరూ ఎవరి నుండి వేరు కాదు. మరి, ఆ శత్రుభావం ఎవరి పట్ల? "ఎవరు ఎవరికి శత్రువు? ఎవరి పట్ల శత్రుభావం కలిగియుండవద్దు. అందరూ ఒక్కటే!" అనే బాబా మాటలు ఈ సత్యాన్నే అత్యంత స్పష్టంగా బోధిస్తున్నాయి.

అంతే, బాబా మాటలతో దాసగణు మనసులో "అమృతానుభవం" ఓవిలకు సంబంధించి గూడుకట్టుకొనియున్న భావ సంక్లిష్టత ఎవరో చేతితో తీసివేసినట్లుగా అంతరించింది. ఓవిలలోని భావానికి సంబంధించిన చిక్కుముడి చేతితో తీసినట్లుగా వీడిపోయింది. అమితమైన ఆనందంతో, ఎనలేని సంతుష్టతతో ఆ ఓవిల భావార్థాన్ని క్రింది విధంగా వ్రాసాడు.

జే తోచి చేతా తోచి చెవావి ॥ తేవి హోచి బుర్ఝే బుర్ఝావి ॥
గురుశిష్యత్వ నాందవి ॥ ఏసే నహీ ॥

భావం :- నిద్రించిన తానే జాగృతమయ్యాడు. అదే విధంగా గురుశిష్య స్థితులలో నున్నది తానొక్కడే !

దాసగణు విరచిత భావార్థం :- "నిద్రించేవాడు, జాగృతమయ్యేవాడు తానే! అక్కడ ఇంకెవరూ లేరు. ఈ రెండు పరస్పర విరుద్ధావస్థలలో తానొక్కడే ఓలలాడాడు. ఆ విధంగా గురుత్వం మరియు శిష్యత్వం అనే రెండు అవస్థలలో సద్గురు ఒక్కడే తమ అవతార కార్యాన్ని కొనసాగించడం జరుగుతుంది".

మ్వణోని బోధ్క్ బోధోని ॥ ఫేసేంప్రామాణె సాధోని ॥
ఏసా నహ్వో భరంవసేనీ ॥ గోసావిహో ॥

భావం :- బోధను బోధించి, ఉపమానాన్ని సాధించిన గోసావి కాదు.

దాస విరచిత భావార్థం :- అందువలన ఆ నివృత్తినాథుని (సద్గురు నాథుని) పదాలతో చూపించలేము. ఇంద్రియ ప్రమాణాలు అక్కడ పని చేయవు. తానొక్కడే! ఇంకెవరూ లేరు. ఒక దీపాన్ని చూపించాలంటే ఇంకొక దీపం అవసరం ఉంటుందా?

**(సశేషం)**







**శ్రీ కృష్ణావతారం**

# శాశ్వత ధర్మగోప్త

**- రచన : భండారు సదాశివరావుగారు**

**(గత సంచిక తరువాయి)**

అప్పటికే మధ్యాహ్న సమయమైంది. అందరూ భోజనాలు ముగించుకున్న తర్వాత, విశ్రాంతి సమయంలో యుధిష్ఠిరుడు విదురుని కలిసారు. "పిన్నాయన గారూ! సంజయుని మాటలు విన్నారు కదా! మీరు మా దగ్గర ఉంటే సాక్షాత్తు మా తండ్రిగారు పాండురాజుగారు ఉన్నట్లే ఉన్నది. ఇది మా అదృష్టం కాదంటారా? కాని పెద్ద నాయన గారి సందేశాన్ని మరో దృష్టితో కూడా ఆలోచించాలి. అక్కడ పెదనాయన గారిని కేవలం దుర్యోధనాదుల దయాదాక్షిణ్యాలకు, కుటిలనీతులకూ బలికానీయకూడదు. మా పట్ల మీ ఆదరం మరువరానిది. కాని అంతకంటే రాజ్యక్షేమం, ప్రజల క్షేమం ముఖ్యం. ధృతరాష్ట్రుల వారు ప్రస్తుతం మన ఏలిక, ప్రజల మంచి చెడుగులు చూడటానికి తమరు అక్కడే ఉండాలి. దానివల్ల శకుని కౌటిల్యాన్ని కనిపెట్టుండవచ్చు. అది అందరికీ క్షేమకరం' అని నచ్చపలికాడు.

విదురుడు అన్యమనస్కంగా అంగీకరించాడు. ఆయనకు పాండవులు ఘనంగా ప్రేమదరాలతో సంభావించి సగౌరవంగా సాగనంపారు. మహాత్ముల కోపం అంతలో కరిగిపోతుంది. విదురుడు పాండవుల ఆదర ప్రేమలకు, సత్త్వభావానికి కరిగిపోయినాడు, పులకరించి ఆనందాశ్రువులు రాల్చి, అందరి నుండి వీడ్కోలు తీసుకొని, బరువు గుండెతో హస్తినకు సంజయునితో వెళ్లాడు.

హస్తినలో విదురుడు ముందుగా తన సౌధానికి వెళ్లి, అక్కడే ఉంటూన్న కుంతీదేవిని దర్శించుకున్నాడు. ఆమెకు పాండవుల యోగ క్షేమాలు తెల్పాడు. వారి నిత్య కార్యక్రమాలను గురించి వర్ణించి చెప్పాడు.

తర్వాత ఆ సాయంత్రం ధృతరాష్ట్రుణ్ణి దర్శించాడు.

విదురుణ్ణి కౌగిలించుకొని "సోదరా! నేను ఏమి చేసినా సహిస్తూ వచ్చిన వాడివి నీవు. ఇంతవరకు ఏమి జరిగినా క్షమిస్తూ వచ్చావు. నా తొందరపాటుకు క్షమించు. ఇక ఎప్పుడూ నన్ను వదలిపెట్టి వెళ్లకు" అని గద్గదంగా అర్థించాడు.

"మహారాజా! చూస్తూ చూస్తూ నేను కౌరవవంశ నిర్మూలనం కోరను కదా. నా మాటలను మీరు విన్నా వినకపోయినా నేను అనృతవాదినైతే కాలేను. ముఖస్తుతి చేయలేను" అని అన్నాడు.

విదురుడు హస్తినాపురాన్ని విడిచివెళ్లడం దుర్యోధనాదులకు పరమానందాన్ని కలిగించింది. నిండు సభలో ఏ సమస్య వచ్చినప్పుడైనా భీష్మ పితామహుడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు తమ తిరస్కార ధోరణికి వెరచి, పరువుకు భయపడి మౌనం వహిస్తారు. మిగతా ఎవ్వరూ తమను కాదనలేరు. మిగిలిందొక విదురుడు. భీష్ముని వలె అతడు కురు రాజ్య సంరక్షకుని సాకూ, సంవర్ధనకూ అంకితుడై నిలిచినవాడు. ధృతరాష్ట్రునికి సన్నిహితుడు. తన సోదరునివలెనే పూర్తిగా సంభావిస్తుండేవాడు. అతని హితోక్తులను గౌరవిస్తుండేవాడు.

"మళ్లీ విదురుడు వచ్చి మహారాజు ప్రక్కన చేరాడు. ఏదో మంతనాలు జరిపి పాండవులను తిరిగి రప్పించడానికి ప్రయత్నిస్తాడు. ఈ వనవాసంలో ఉన్నప్పుడే వారిని ఏదో విధంగా శాశ్వతంగా మట్టుపెట్టాలి" అని దుర్యోధనుడు తన సంకల్పాన్ని బైటపెట్టాడు.

శకుని ధుర్యోధనుణ్ణి అపహసించాడు. "సుయోధనా! నీవెంత వెర్రి వాడివయ్యా! పాండవ జ్యేష్ఠుడు నిత్య సత్యవ్రతుడని నీకు తెలియదా! మీరు వెళ్లి వారిని తిరిగి రమ్మని బ్రతిమాలినా పదమూడేండ్ల గడువు తీరిందాకా హస్తినలోకి అడుగుపెట్టరు. అదే అతని బలహీనత-మన బలం" అన్నాడు.

**(సశేషం)**





# మృత్యు ముఖం నుండి ...

**- యిమ్మిడిశెట్టి ప్రభాకరరావు, హైదరాబాదు**

అహమ్మదాబాద్ నగరం రిలీఫ్ రోడ్‌లో చందక్‌లాల్ చమన్‌లాల్ మనాకీవాలా అనే అడ్వకేటు ఉండేవాడు. 1948వ సంవత్సరం నుంచీ అతడు ఉబ్బురోగం (డ్రాప్సీ)తోనూ గేస్ట్రిక్ అల్సర్‌తోనూ బాధపడుతున్నాడు. ఆకలి బాగా మందగించింది. అప్పుడప్పుడు రక్తపు వాంతులు కూడా అయ్యేవి. సరిగ్గా ఏమీ తినలేడు, త్రాగలేడు. మంచినీరు కూడ అతి కష్టం మీద త్రాగగలుగుతున్నాడు. అలా జబ్బు ముదిరిపోయి అతడి బరువు 300 పౌండ్లకు (136 కేజీ) పెరిగింది. 1952 జనవరి నెల నుంచి మంచానికే పరిమితమయిపోయాడు. అతడి దగ్గరి బంధువు ఒకరి సలహాతో, తనకి ఎదురుగానున్న గోడకి సాయిబాబా ఫొటో ఒకటి తగిలించి, ప్రతిరోజూ బాబాని ప్రార్థించసాగాడు. కానీ, అప్పుడప్పుడు తను ఒక ముస్లిం ఫకీర్‌ని ఆరాధిస్తున్నానేమో అన్న శంక అతడి మనసులో తలెత్తుతుండేది. అయినప్పటికీ ఫొటోలోని బాబా కళ్ళు, ఆయన యొక్క రూపం అలా చూస్తూ వున్నందువల్ల క్రమేణా బాబా యందు భక్తి భావం పెరగసాగింది. ఒకనాటి సాయంకాలం మనాకీవాలా మగతనిద్రలో వుండగా బాబా కలలో కనిపించి, తను ముస్లిం ఫకీరును కానని దత్తాత్రేయుడి అవతారమని ఎంతో స్పష్టంగా చెప్పారు. అంతేకాదు తాజుద్దీన్ బాబా, నాగపూర్ బాబా, ఖాండ్వాలో వుండే ధునీవాలా దాదా, వాసుదేవానంద సరస్వతీ స్వామి (తెంబే స్వామి), అక్కలకోట స్వామి ... ఇలా తొమ్మిది దత్తావతారాల రూపాలలో నా అవతార కార్యం నిర్వహిస్తుంటాను అని కూడ చెప్పారు. దానితో మనాకీవాలాకు సాయిబాబా ముస్లిం అన్న శంక పూర్తిగా తొలగి

పోయింది. ఒక స్నేహితుడి ద్వారా బాబా గురించి వ్రాసిన రెండు గ్రంథాలు తెప్పించుకొని నెమ్మదిగా చదవసాగాడు. ఆ తరువాత మరి కొన్నాళ్లకి అతడి ఆరోగ్యం మరింతగా క్షీణించింది. వైద్యులు మనాకీవాలాను పరీక్షించి అతడికి ఆఖరు ఘడియలు సమీపించాయని, మరికొన్ని గంటలు మాత్రమే జీవించి అవకాశం వుందని స్పష్టంగా చెప్పారు. అలా అందరూ నిరాశా నిస్పృహల మధ్య ఉండగా అతడి తల్లికి బాబా కలలో కనిపించి, భయపడకండి. మీ కష్టాలన్నీ తీరుస్తాను. వెంటనే మీ మనుమడిని షిరిడీ పంపించండి" అని చెప్పి అంతర్ధానమయ్యారు.

లాయరు బాబాకు కుటుంబీకులు, దగ్గరి బంధువులు అతడి కొడుకుని షిరిడీని పంపించాలా వద్దా అన్న సందిగ్ధంలోపడ్డారు. మనాకీవాలా కుమారుడు చిన్నవాడు. అంతంత దూరాలు ఇది-వరలో ప్రయాణించిన అనుభవం కూడా లేదు. ఇతణి చూస్తే ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి! ఏదైనా జరగరానిది జరిగితే తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించవలసిన కొడుకు దూరంగా వుంటే ఎలా? కాని మనాకీవాలా మట్టుకు సాయిబాబా యందు ఎంతో విశ్వాసంతో కొడుకుని షిరిడీ పంపించడానికే నిర్ణయించాడు. ఇలాంటి సందిగ్ధస్థితిలో కొట్టుమిట్టాడుతుండగా సాయిబాబా మరొకసారి కలలో కనిపించి", భయపడ వద్దు. నేను అతడి వెన్నంటే వుంటాను. అబ్బాయిని బయలుదేరమను. ఆలస్యం చెయ్యొద్దు. రేపు మధ్యాహ్నం సరిగ్గా 12 గంటల ప్రాంతంలో అతడు షిరిడీ క్షేమంగా చేరినట్లు తంతి వస్తుంది" అని అభయమిచ్చారు. ఈ విషయం విని డాక్టర్లు వాళ్లంతో భ్రమలో వున్నారని ఎగతాళి చేశారు.

బాబా ముందుగా సూచించినట్లుగా ఆ అబ్బాయి షిరిడీ చేరాడు. అతడు క్షేమంగా షిరిడీ చేరినట్లుగా మధ్యాహ్నం 12 గంటలకు తంతి





వచ్చింది. అతడి కొడుకు షిరిడీ చేరాడు అన్న తంతి రాగానే మనాకీవాలాకు ఎడతెరిపి లేకుండా విరేచనాలయ్యాయి. అలా 24 గంటలపాటు కొనసాగింది. దానితోపాటు మూత్రవిసర్జన జరిగింది. రక్తస్రావం కూడా ఆగిపోయింది. మరునాటికల్లా మనాకీవాలా శరీరంలోని విషపదార్థాలన్నీ విసర్జింపబడి శరీరం ఎంతో తేలికయిపోయింది. అతడి బరువు 300 పౌండ్ల నుంచి 75 పౌండ్లకు తగ్గింది! గుండె సాధారణంగా కొట్టుకుంటున్నది. నాడి కూడ చక్కగా ఉంది. బి.పి. నార్మల్. అతణ్ణి పరీక్షించి, డాక్టర్లు విస్తుపోయారు. ఇది ఆధునిక వైద్య శాస్త్రానికి కూడా అందని అద్భుతం అన్నారు. రెండు, మూడు నెలలకు మనాకీవాలా నెమ్మది నెమ్మదిగా మామూలుగా ఆహారం తీసుకోసాగాడు. కొద్దినెలలలోనే అతడు తన న్యాయవాద వృత్తి కూడా మొదలుపెట్టాడు. శరీరంలో మరికొంచెం సత్తువ చేరగానే షిరిడీ దర్శించాడు. తరువాత తీర్థయాత్రలకు బయలుదేరి దక్షిణాది పుణ్యక్షేత్రాలన్నీ ఏ ఇబ్బందులూ లేకుండా దర్శించాడు.

ఆలిండియా సాయి సమాజ్ మదరాస్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు అయిన పరమపూజ్య శ్రీ బి.వి. నరసింహస్వామి వారి 80వ జన్మదినోత్సవ వేడుకలు ది.19.08.1953న మదరాసులో జరుపతలపెట్టారు. తన దక్షిణ దేశ యాత్ర సందర్భంగా ఆగస్టు 8, 9 తేదీలలో మనాకీవాలా మదరాసులో వున్నాడు. సాయిబాబా అతడికి మరొకసారి దర్శనం ఇచ్చి మైలాపూర్, మద్రాసులోని సాయిబాబా మందిరాన్ని దర్శించమనీ, అక్కడి భక్తులకు తన అనుభవాలు వివరించమనీ, ముఖ్యంగా నరసింహ స్వామి వారికి తెలుపమని సందేశం ఇచ్చారు!

జై సాయిరాం.

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము



## భక్తి పద్య కావ్యము

రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

**(గత సంచిక తరువాయి)**

ఆ.వె. నింద జేయ రాదు నిందించ దగినట్టి
తప్ప జేసి నోడ్ని యెప్పడైన
నింద జేయ చేటు నీకెయగును రోరి
వాని కగును మేలు వాని దిట్ట 26

ఆ.వె. నింద జేయు వాని నిందించ వలదోయి
ప్రేమ పంది దినెడు పెంట వోలె
పాప మంత నీదు పరమ ప్రేమమయుడు
నాకి శుద్ధి జేయ నష్టమేమి 27

ఆ.వె. నేనె సర్వ వ్యాపి నే విశ్వ భూతాత్మ
అన్య భావమీడి యమిత భక్తి
దీక్ష గలిగి నన్ను దినము రాత్రి దలచు
భక్తు నిడువ ననుచు బాబ పలికె 28

ఆ.వె. రావలసిన దెల్ల రాకుండ బోవదు
రానిదింక రానె రాదనుటలు
చెల్లు యిహమునందు, చెల్లదాధ్యాత్మిక
ప్రగతి పథము నందు పరము బడయ 29





ఆ.వె. చావు పుటుక లనెడు చక్రాల దిరుగక
స్థిరమనమున శాంత చిత్తు లగుచు
పరుల సేవ జేసి పరమాత్ము మెప్పించు
పుణ్య చరితు లందు పూని యుందు 30

ఆ.వె. మనన శ్రవణ పఠన మరువని నాలీల
నామ జపము భక్తి నాటినట్టి
వారి హృదయ సీమ వసియింతు ననెసాయి
సాయినాథు గొలువ సాగి రండు 31

కం. కొందరు గీతాపఠనము
కొందరు గురు చరిత యున్న కొందరు జపమున్
కొందరు శ్రవణము జేయగ
నందరి నియమించు బాబ నాయా పనులన్ 32

కం. కొందరి కరుణను కలలో
కొందరి పీడనల సాయి కొందరి సేవన్
అందరి నాయా రీతుల
బంధముడగ జేసె వారు పరమున్ బొందన్ 33

కం. నిచ్చైన దెచ్చిన వామను
కిచ్చైను మిక్కిలి ధనమును గేహముఁదాటన్
నొచ్చక కూలికి సరిపడ
నిచ్చెడు నతనికి గల్గును యిహమున్ పరమున్ 34

తే.గీ. సరిపడ ధనంబు నీయగా సంతసమున
పనులు జేయును ప్రాణము ఫణము బెట్టి
కూలి యజమాని యనియెడు కల్మషంపు
భేద భావము లేనట్టి ప్రీతి గలిగి 35

**(సశేషం)**

# గురువు-సాధన

- శ్రీ తెలికచర్ల సుబ్రహ్మణ్య శర్మ

**(గత సంచిక తరువాయి)**

ఈ మార్గము నవలంబించి ముక్తిని పొందుటకైన లేదా ఉపేక్షించి అధఃపతనము చెందుటకైన మనస్సే కారణము. కావున ముందుగా మనస్సును వశపరచు కోవాలి. మనస్సును కదలకుండా నిశ్చలంగా ఉండునట్లు చేస్తేనే తప్ప "నిరాకార బ్రహ్మస్వరూపము" మనస్సుకు గోచరించదు. ప్రారంభదశలో విగ్రహారాధన మీద మనస్సు నిలిపి భక్తి శ్రద్ధలతో క్రమశిక్షణాయుతంగా నియమనిష్ఠలతో, విశ్వాసంతో పూజించాలి. ఈ విధంగా చేస్తూ ఉండినచో మనస్సు పరిపరి విధము లుగా పోకుండా దైవ విగ్రహము మీద నిలిచి ఉంటుంది. ఈ విధముగా సాధన చేస్తూ ఉన్న కొలది ఈ ఆరాధన కూడా నిలిచిపోయి తాను ఆత్మ స్వరూపుడననే విషయం గోచరిస్తుంది.

కాబట్టి మనస్సును నిశ్చలంగా ఉంచుటకు విగ్రహారాధనే ప్రథమమున విశేష ప్రయోజనకారి మరియు సామాన్య సాధకులకు అందుబాటులో ఉన్న సులభమైన మార్గము.

◆ ◆ ◆

ఆధ్యాత్మికముగా తమతమ జీవితాలకు ఏమి కావాలో చాలామందికి తెలియదు. అందుకే నిత్యజీవితంలో సహజంగా తమకు ఇష్టమైన, భౌతిక పరమైన వాంఛలనే కోరుకుంటూ ఉంటారు. యథార్థానికి మనకు శాశ్వతానందాన్ని ఇచ్చే మోక్షాన్ని, ఆ మోక్షమార్గాన్ని తెలుసుకోవాలని కోరుకోవాలి.

సహజముగా యీ భౌతికపరమైన వాంఛలకు మన ఆత్మలో అంత ర్యామిగా వున్న దైవము అంగీకరించడు. ఈ సూక్ష్మాన్ని గమనించని సామాన్య సాధకులు ఎన్నాళ్ళు సాధన చేసినా వారి కోర్కెలు తీరవు. దానితో తాను ఎంత సాధన చేసినా దైవము సహాయము చేయలేదని అపోహ





పడతారు. ఆ తరువాత దైవత్వాన్ని అనుమానించి నాస్తికుడుగా మారతాడు. చివరకు పతనం చెందుతాడు.

ఇట్టి సంశయాలు కలిగిన సమయములో కేవలం ఆధ్యాత్మిక శ్రవణం, సద్గ్రంధపఠనం, విగ్రహారాధన, సత్సాంగత్యము మాత్రము సరిపోవు. మననం చెయ్యాలి. ఆత్మవిమర్శన చేసుకుంటూ శ్రద్ధాసక్తులతో ఆరాధన చెయ్యాలి. ఆ తరువాత నిష్కామమైన అకుంఠిత దీక్షతో నిరంతర సాధన చెయ్యాలి. ఇట్టి మహత్తరమైన సమన్వయ కృషిని సామాన్యులమైన మనము స్వయముగా చేయలేము. ఇట్టి మోక్షప్రదమైన సత్కార్యానికి "సద్గురువు" యొక్క ఆవశ్యకత ఎంతయినా ఉన్నది.

"దీపాద్దీపవత్" - అనగా జ్యోతిని మరియొక జ్యోతితోనే వెలిగించాలి- అను వాక్యము ప్రకారము మనకు ఆత్మసాక్షాత్కారము మరియొకరి ఆత్మ నుండి కలగాలి. అట్టి వ్యక్తినే "గురువు" అని పెద్దలు చెబుతారు.

ఆధ్యాత్మిక జీవితంలో ఆత్మజ్ఞానమును పొందాలంటే సాధకులు గురువు యొక్క సంపూర్ణ ఆధీనములో ఉండాలి. ఆత్మార్పణభావంతో గురువు యొక్క వాక్కును వేదవాక్కులా భావించి అనుసరించాలి.

"బ్రహ్మానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యం.
ఏకం నిత్యం విమలమచలం సర్వాధీ సాక్షీభూతం
భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి"

పరమ సుఖదాయకమైన బ్రహ్మానంద స్వరూపుడు, కేవలం మూర్తీభ వించిన జ్ఞాన స్వరూపుడు, రాగద్వేష, సుఖదుఃఖాది ద్వంద్వ వికారాలన్ని టికీ అతీతుడు, ఆకాశంలా దేనిని అంటని విశాల స్వరూపుడు, తత్త్వమస్యాది వేదాంత మహావాక్యాలు ప్రబోధించే పరమాత్మ స్వరూపుడు, ఏకైక అద్వయానంద స్వరూపుడు, శాశ్వతమైనవాడు, స్వచ్ఛమైనవాడు, నిశ్చల స్వభావుడు, సర్వ బుద్ధీంద్రియ వ్యాపారులకు అతీతుడు, మనోభావాలకు అందనివాడు, సత్వ, రజ, స్తమో గుణాలు మూడు లేనివాడు, అయిన సద్గురు మహానుభావునకు నా హృదయపూర్వక ప్రణామములు

అర్పిస్తున్నాను.

"గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।

గురుసాక్షాత్పర బ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః" ॥

బ్రహ్మా, విష్ణు, మహేశ్వరుల యొక్క స్వరూపమైనట్టియు, సాక్షాత్తు పరబ్రహ్మా స్వరూపమైనట్టియు, అద్వితీయుడైనట్టియు అయిన శ్రీ గురు దేవులకు నమస్కరించుచున్నాను.

ఈ విషయమే "గురుగీత" గ్రంథములో -

"గుకారశ్చాన్ధకారోహి రుకారస్తేజ ఉచ్యతే,

అజ్ఞాన గ్రాసకం బ్రహ్మా గురురేవ న సంశయః" ॥

'గు' అను అక్షరము అజ్ఞాన తిమిరము కాగా, 'రు' అను అక్షరము జ్ఞాన తేజమై ప్రకాశించుచున్నది. అందుచేత గురుదేవుడు అజ్ఞానమును హరించు పరబ్రహ్మమే అయి వున్నాడు. ఈ విషయములో ఎట్టి సందేహము లేదు.

### విధిని మార్చటం సాధ్యమా?

**(26వ పేజీ తరువాయి)**

అందుకు ఆ రైతు, "అయ్యా, నేను వెళ్ళిన చోట ఎలాంటి కొత్త సంఘటనా జరుగలేదు. కాని అక్కడకు ఒక మహాత్ముడు వచ్చాడు. ఆయనకు నేను సాష్టాంగపడి నమస్కరించాను. ఆయన నన్ను చూసి 'దీర్ఘాయువుతో జీవించు!' అని ఆశీర్వదించారు. ఇదే జరిగింది, అంతే" అని జవాబిచ్చాడు.

ఈ ఉదంతం విన్న సైనికుడు, రాజుతో "రాజా! చూశారా! ఈ రైతు పాము వాతపడి మరణించి ఉండాలి! కాని ఒక మహాత్ముని దీవెన కారణంగా, ఈతడి విధి మారిపోయింది. మహాత్ముల దీవెనకు విధిని మార్చే శక్తి ఉంది" అని వివరించి చెప్పాడు.

రాజు, సైనికుడు ఇచ్చిన వివరణను మనస్ఫూర్తిగా అంగీకరించాడు. అంతేకాక సైనికుడికి, ఆ రైతుకు కానుకలు కూడా ఇచ్చాడు.





# మాతృసంస్థ కబుర్లు

సాయిధామం సేవాశ్రమంలో ఆగస్టు 16వ తేదీన సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరిగాయి. ఆశ్రమానికి చుట్టుప్రక్కల ఉన్న సుమారు 16 గ్రామాల మాతృమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామీజీ వారిచేత శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమం చేయించి, వరలక్ష్మీవ్రత కథలను కళ్లకు కట్టినట్లుగా వివరించారు. అమ్మవారిని పూజించటం అంటే ఏదో తంతుగా కాక అమ్మ చెప్పిన అడుగుజాడలలో నడవటమని, ఇంట్లో అమ్మలు ధర్మబద్ధంగా పిల్లలను పెంచాలని, మన ధర్మం, సభ్యత, సంస్కారాలు పిల్లలకు నేర్పించాలని సెలవిచ్చారు.

అనంతరం వచ్చిన మాతృమూర్తులు ఒకరికొకరు తాంబూలం, రవిక బట్టలు, గాజులు ఇచ్చి పుచ్చుకొని ఆశ్రమం అందించిన పులిహోర, దద్ధోజనం ప్రసాదం తీసుకుని తరలి వెళ్ళారు.

ఆగస్టు 24న సాయిధామం ఆశ్రమంలోని శ్రీ సాయి విద్యాధామం ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. విద్యార్థులు రాధా, శ్రీకృష్ణుని వేషధారణలతో పాఠశాల ప్రాంగణం అంతా 'బృందావనం'లా తలపించింది. స్వామీజీ వారి మార్గదర్శనంలో శ్రీకృష్ణ పూజా కార్యక్రమం జరిగింది. స్వామీజీ తమ ఉపన్యాసంలో కృష్ణతత్వం నేటి సమాజానికి శిరోధార్యం అని వివరిస్తూ శ్రీ కృష్ణ లీలలు కథల రూపంలో వివరించారు. పిల్లలంతా భక్తి పారవశ్యంతో విన్నారు. అనంతరం నృత్యాలతో, కోలాటాలతో అలరించారు. మధ్యాహ్నం ఉట్టి కొట్టటం కార్యక్రమంలో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆగస్టు 26న ఇ.సి.ఐ.యల్. పరిధిలోని గాయత్రి నగర్‌లో బాలగోకులం వారు నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలలో శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద

ప్రభుజీ వారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలగోకులం చిన్నారులు ప్రదర్శించిన నాటికలు, భాగవత కథ లీలలు, మరియు నృత్యాలను తిలకించి ఆశీః ప్రసంగం చేశారు. అనంతరం నిర్వాహకులు స్వామీజీని సత్కరించి ఆశీస్సులు పొందారు.

## శ్రీ కోదండ రామసాయి సన్నిధానం ఆశ్రమం-సత్తెనపల్లి శాఖ

ఆగస్టు 14, 15 తేదీలలో ఆశ్రమంలోని ఆనంద సాయి ప్రభు మందిర దశమ వార్షికోత్సవ కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగినవి.

13వ తేదీ సాయంత్రానికి సాయిధామం నుండి శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు వచ్చారు. ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. 14వ తేదీ ఉదయం గం.5.15 ని.లకు కాకడ హారతి, 6 గం.లకు ధ్వజారోహణ కార్యక్రమం శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి కరకమలములచే జరిగినది. అనంతరం గం.7.00లకు ఆనంద సాయి ప్రభు వారికి సహస్ర కలశాలతో అభిషేకం వైభవోపేతంగా జరిగినది. ముందుగా సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు ఆనంద సాయికి పంచామృతాలతో అభిషేకం చేసిన తరువాత ప్రతి ఇంటి నుండి కలశాలతో అభిషేక జలం తీసుకొని వచ్చిన భక్తులందరు ఆనంద సాయికి అభిషేకం చేసి తరించారు.

అనంతరం ఆనంద సాయికి నూతన వస్త్రాలంకరణ, అష్టోత్తర శత నామ పూజ జరిగినది. రాత్రి గం.7.00లకు రంగా కాలనీ భజన బృందం వారిచే భజన కాలక్షేపం జరిగినది. ఆశ్రమంలో ప్రధాన ఆలయాలు, ఉపాలయాలు విద్యుద్దీపాలంకరణతో ప్రకాశించినవి.

ఆగస్టు 14 రాత్రి 12 గం.ల వరకు బాబా మందిరం పూలమాలలతో, అరటి పిలకలతో, మామిడి తోరణాలతో అలంకరణ పూర్తి కావించాము. ఒకప్రక్క మరుసటి రోజు కార్యక్రమానికి, అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు నడుస్తున్నవి.





ఆగస్టు 15 ఉదయం గం.5.15 ని.లకు కాకడ హారతి, అనంతరం బాబా వారికి అభిషేకం, తరువాత నూతన వస్త్రధారణ, కిరీటధారణ జరిగినది. శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్-ఇన్‌ఛార్జి మేనేజింగ్ ట్రస్టీ శ్రీ చంద్రారెడ్డిగారిచే బాబా వారికి పూలమాలా లంకరణ జరిగినది. అనంతరం ఆనంద సాయికి అష్టోత్తర శత నామావళి పూజా కార్యక్రమం జరిగినది.

నూతన వస్త్రాలతో, కిరీటధారులై, పూల మాలాలంకృతులైన ఆనంద సాయి ప్రభు వారు దివ్యతేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. వచ్చిన భక్తులు భక్తి పారవశ్యులై బాబాను కనులారా దర్శించి తరించారు.

ఉదయం గం.10 లకు సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారు సహస్ర నామార్చన పూజలో పాల్గొన్న భక్తులందరి చేత శాస్త్రోక్తంగా పూజ చేయించారు. వివిధ రకాల పుష్పాలతో బాబాను అభిషేకిస్తుండగా వచ్చిన భక్తులు కన్నుల పండువగా దర్శించి తరించారు.

12 గం.లకు మహా హారతి జరిగినది. అనంతరం శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారి ప్రవచనము జరిగినది. తరువాత మధ్యాహ్నం 12.45 ని.లకు ఆనంద సాయి ప్రభు వారి దశమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అన్నప్రసాద వితరణ జరిగినది. సుమారు 2000 మంది పైన భక్తులు అన్నప్రసాదం స్వీకరించి ధన్యులయ్యారు. కార్యక్రమం ఆద్యంతం ఎటువంటి ఆటంకం లేకుండా జరిపించుటకు పరమపూజ్య గురుదేవులు, మాతాజీ వారి శుభాశీస్సులు మాయందు ఉన్నాయి. ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన భక్తులందరికీ ఆనంద సాయి ప్రభు ఆశీస్సులు.

ఆగస్టు 26 ఆశ్రమంలో ఆనంద సాయి ప్రభు మందిరంలో కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటు చేసి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వచ్చిన పిల్లలందరిచే ఉట్టి కొట్టే కార్యక్రమం

కోలాహలంగా జరిగినది. ప్రసాద వితరణతో కార్యక్రమం ఘనంగా ముగిసినది.

ఆగస్టు 28వ తేదీ ఆశ్రమంలోని రామాలయం ఉత్తర, దక్షిణ ద్వారాలు పాత వాటిని తొలగించి వాటి స్థానంలో నూతన రాతి ద్వారాలు ఏర్పాటు చేయడానికి శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో అంకురార్పణ కార్యక్రమం జరిగినది. దక్షిణ ద్వారానికి శ్రీ రాయుడు పానకాలు వారి బ్రదర్స్, ఉత్తర ద్వారానికి శ్రీ శాత్రాసుపల్లి గోపీకుమార్ గారి ఆర్థిక సహకారంతో నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమైనవి. శ్రీ కోదండ రాముని అనుగ్రహంతో పనులు చకచకా జరుగుతున్నవి. ఈ కార్యక్రమంలో దాతలు ఆశ్రమ కార్యకర్తలు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. ప్రసాద వితరణతో కార్యక్రమము ముగిసినది.

సెప్టెంబర్ 7వ తేదీ ఆశ్రమంలో మట్టితో చేసిన వరసిద్ధి వినాయకుని ఏర్పాటు చేసి 9 రోజులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 9వ రోజు వరసిద్ధి వినాయకుని నిమజ్జనోత్సవ కార్యక్రమం ఆశ్రమంలోని రావిచెట్టు దగ్గర వైభవంగా జరిగినది. ప్రసాద వితరణతో కార్యక్రమం ఘనంగా ముగిసినది.

# నవ్వుకు ఏది కారణం?

ఒక రాజుకు జీవితంలో 'నవ్వు' అన్నదే లేకుండా పోయింది. ఆయనకు నవ్వు కరువయ్యింది. 'తన నవ్వు తస్కరింపబడింది' అని రాజు అనుకో సాగాడు.

ఇలా ఉండగా ఒకరోజు ఇక ఉండబట్టలేక తన మంత్రితో, "నేను నవ్వి ఆనందించడానికి మార్గం ఏమిటి?" అని అడిగాడు.

అందుకు ఏం జవాబు ఇవ్వాలో మంత్రికి పాలుబోలేదు. అయినా ఏదో జవాబు ఇవ్వకుండా ఉండకూడదు కదా! అందుకని వెంటనే, "రాజా!





ఇందుకు ఓ ఉపాయం ఉంది. నవ్వి ఆనందిస్తున్న ఒక వ్యక్తి ధరించిన చొక్కా తీసుకుని ధరించండి. దాంతో మీరూ నవ్వి ఆనందభరితులు అవుతారు" అని తడుముకోకుండా సలహా ధోరణిలో జవాబిచ్చాడు.

'నవ్వుతూ ఆనందంగా ఉన్న ఒక వ్యక్తిని కలుసుకొని, అతడి చొక్కాను అడిగి పుచ్చుకోవాలి' అని రాజు మనసులో అనుకొని వెంటనే గుర్రం మీద బయలుదేరాడు.

రాజు నగరంలోకి వెళ్లి కొందరిని కలుసుకున్నాడు. వారిని, "మీరు నవ్వుతూ ఆనందంగా ఉంటున్నారా?" అని అడగడం ప్రారంభించాడు.

కాని ఆయన కలుసుకున్న ప్రతి ఒక్కరూ, "నాకు ఈ దిగులు, నాకు ఆ దిగులు, నాకు ఆ కొరత, నాకు ఈ కొరత!" అనే జవాబిచ్చారు.

రాజు కలుసుకున్న వ్యక్తుల్లో మచ్చుకు ఒక్కరు కూడా "నేను నవ్వుతూ ఆనందంగా జీవిస్తున్నాను" అని జవాబు ఇవ్వలేదు.

ఈ జవాబులతో రాజు నైరాశ్యం చెందలేదు. పైపెచ్చు తన ప్రయత్నాన్ని తీవ్రతరం చేశారు. 'నవ్వుతూ ఆనందంగా జీవిస్తున్న వ్యక్తిని ఆరు నూరైనా కనుగొని అతడి చొక్కా పొంది తీరతాను' అనే దృఢనిశ్చయంతో తన అన్వేషణను కొనసాగించాడు.

రాజు వెళుతున్న దారిలో, కాస్త దూరంలో ఎవరో బిగ్గరగా నవ్వే శబ్దం వినవచ్చింది.

రాజు ఆవైపుగా వెళ్లి చూడగా ఒక చెట్టు క్రింద ఒక వ్యక్తి కూర్చొని ఉన్నాడు. అతడే బిగ్గరగా నవ్విన వ్యక్తి అని రాజు గుర్తించాడు. కానీ, ఆనందిస్తూ బిగ్గరగా నవ్విన ఆ వ్యక్తి దిగంబరుడుగా ఉన్నాడు.

అప్పుడు రాజుకు, 'ధరించిన వస్త్రానికీ, ఆనందానికీ ఎటువంటి సంబంధమూ లేదు' అన్న వాస్తవం గ్రహింపుకు వచ్చింది.

# విధిని మార్చటం సాధ్యమా?

ఒక రాజు తన వీరులతో అరణ్యంలోకి వేటాడటానికి వెళ్ళాడు.

ఏదో వింత శబ్దంతో కూస్తున్న ఒక పక్షి రాజు కంటపడింది.

రాజు సైనికులలో పక్షి భాష తెలిసిన ఒక సైనికుడు ఉన్నాడు.

రాజు ఆ సైనికుణ్ణి పిలిచి, "ఆ పక్షి ఇప్పుడు ఏం చెప్పింది?" అని ప్రశ్నించాడు.

అందుకు ఆ సైనికుడు, "రాజా! ఆ పక్షి మనలను గురించి ఏమీ చెప్పలేదు. ఈ దారిగుండా ఒక రైతు వెళతాడు. అతడు ఈ రోజు పాము కాటుతో మరణిస్తాడని చెప్పింది" అని జవాబిచ్చాడు.

'ఈ సైనికుడు చెబుతున్నది నిజమేనా?' అని రాజు తెలుసుకోగోరాడు. అంతే! రాజు, అతడి సైనికులు వేట కార్యక్రమాన్ని కట్టిపెట్టి అక్కడే కాచుకుని ఉండిపోయారు.

వాళ్ళు దాదాపు గంటసేపు అక్కడే నిరీక్షిస్తూ ఉండిపోయారు. ఆ తరువాత ఆ దారిగుండా ఒక వ్యక్తి వెళ్ళాడు. అతడి చేతిలో ఒక కొడవలి ఉంది.

ఆ రైతును చూసి రాజు తన సైనికులతో, "ఆ పక్షి చెప్పిన భవిష్యవాణి ఇప్పుడు సగం నిజమైంది. తక్కిన సగమూ నిజమేనా అన్న విషయం నిర్ధారణ చేసుకోవడానికి మనం ఇక్కడే నిరీక్షించి చూద్దాం" అని చెప్పాడు.

ఆ ప్రకారం రాజు, సైనికులు ఎక్కడికీ పోకుండా అక్కడే ఉండిపోయారు.

సాయంత్రం కావచ్చింది. ఉదయం రాజు చూసిన ఆ రైతు, తన తల మీద ఒక పెద్ద పచ్చగడ్డి మోపును మోసుకొంటూ వస్తున్నాడు. ఆ మోపులో ఒక కొడవలి దూర్చబడి ఉంది.





రైతును చూసిన రాజు, తన పక్కనే ఉన్న సైనికుడితో, "నువ్వు ఈ రైతు ఈ రోజు పాము కాటుతో మరణిస్తాడు' అని చెప్పావు నువ్వు చెప్పినట్టు జరుగుతుందా అని, నేను ఇక్కడే రోజంతా కూర్చుండిపోయాను. అందువల్ల నాకు ఒక రోజు వ్యర్థమైంది.

"ఇప్పడు రైతు సజీవుడిగానే తిరిగివస్తున్నాడు! పక్షి అబద్ధం చెప్పిందా? లేక నువ్వు నన్ను మోసపుచ్చావా? ఈ రైతు మరణం నుంచి తప్పించుకొన్నాడనడానికి, నువ్వు సరియైన వివరణ ఇవ్వాలి. లేకుంటే కఠిన శిక్షకు గురి కావలసి ఉంటుంది" అన్నాడు కోపోద్రిక్తుడై.

అప్పడు ఆ సైనికుడు వినయంగా, "రాజా! పక్షి చెప్పింది ఇంతవరకు అబద్ధం కాలేదు! రైతు ప్రాణాలతో ఉండటానికి కారణం ఏమిటో నాకు తెలియడం లేదు. రైతు వెళ్ళిన చోట ఏం జరిగిందో అతణ్ణే పిలిచి అడగండి!" అన్నాడు.

ఇంతలో రైతు, రాజు ఉన్న చోటుకు రానే వచ్చాడు. అప్పడు మన సైనికుడు, "మీ నెత్తి మీద ఉన్న పచ్చిక మూటను కింద పడెయ్యండి!" అని రైతును ఉద్దేశించి చెప్పాడు.

రైతు తన తల మీద ఉన్న పచ్చి గడ్డి మూటను కింద పడవేశాడు.

గడ్డిమూట కింద పడ్డ వేగానికి దాన్ని కట్టి ఉంచిన తాడు తెగి, గడ్డి అటూ ఇటూ చెల్లాచెదరయింది. అప్పడు గడ్డిమోపు మధ్యలో కత్తితో ఖండింపబడి చచ్చిన ఒక పాము కనిపించింది.

అది చూసి సైనికుడు, రాజుతో, "రాజా! రైతు ఈ పాము కాటుతో మరణించి ఉండి ఉండాలి! అలా జరగకపోవడానికి అతణ్ణి మీరే విచారించండి" అని విన్నవించాడు.

అప్పడు రాజు, రైతుతో "ఏమయ్యా, నువ్వు వెళ్ళిన చోట కొత్త సంఘటన ఏదన్నా జరిగిందా?" అని ప్రశ్నించాడు.

**(మిగతా 19వ పేజీలో)**

# ఆ ఆత్మే నీవు! (తత్త్వమసి)

ఉద్ధాలక మహర్షి కుమారుడైన శ్వేతకేతువుకు పన్నెండు సంవత్సరాలు నిండాక, "శ్వేతకేతూ! నీవు గురువుల వద్దకు వెళ్ళి అధ్యయనం చేయ వలసిన సమయం వచ్చింది. ఆత్మజ్ఞానం లేనివరు మన వంశంలో ఎవరూ లేరు. కాబట్టి నీవు కూడా గురువులను ఆశ్రయించి జ్ఞానసముపార్జన చేసి తిరిగి రా!" అని అన్నాడు.

మన పూర్వీకుల గొప్పతనాన్ని తెలుసుకోవడం ఎంతైనా అవసరం. ఉద్ధాలకుడు చెప్పినట్టు మన పూర్వీకులు ఏమి గొప్ప పనులు సాధించారో తెలుసుకుంటే దానివల్ల మనకు కూడా గొప్ప పనులు చేయాలన్న కోరిక, పట్టుదల కలుగుతాయి. భారతీయ ఋషులే మన పూర్వీకులు. వారి గొప్పతనం ఆచంద్రతారార్కంగా నిలిచి ఉంటుంది. వారు మానవ జీవితానికి ఆదర్శం ఏమిటో, దాన్ని ఎలా సాధించాలో చక్కగా వివరించారు. మనం కూడా వారి అడుగుజాడలలో నడవాలి.

తండ్రి ఆజ్ఞ ప్రకారం శ్వేతకేతువు ఒక గురువును ఆశ్రయించి పన్నెండు సంవత్సరాలు వేదాధ్యయనం చేశాడు. శ్వేతకేతువు ఆ సమయంలో, తాను చెవుల ద్వారా విన్నది, నోటితో వల్లె వేసినది, మనస్సుతో అర్థం చేసుకున్నది మాత్రమే జ్ఞానం అనుకున్నాడు. అందువలన అధ్యయనం పూర్తి అయిందనీ, ఇక తాను సర్వజ్ఞుణ్ణనీ అనుకోసాగాడు. తనకు అంతా తెలిసిపోయిందన్న గర్వంతో, దర్పంతో ఇంటికి తిరిగి వచ్చాడు. అతనిలోని గర్వాన్ని, ఆ గర్వం మిగిలివుండడం వల్ల తొలగిపోని అతని అవివేకాన్ని తండ్రి గుర్తించాడు.

అతడు శ్వేతకేతువును తన దగ్గరకు పిలిచి, "నాయనా! ఇంద్రియా లకు, మనస్సుకు, బుద్ధికి అతీతమైనది ఏమైనా ఉందా అనీ, దానిని తెలుసు కునే పద్ధతులు ఏమిటనీ మీ గురువులను ఎన్నడైనా ప్రశ్నించావా?" అని అడిగాడు. శ్వేతకేతువుకు అటువంటి జ్ఞానం ఒకటి ఉంటుందని ఏమాత్రం





తెలియదు. అతడికి ఏమి చెప్పాలో పాలుపోలేదు. తాను తెలుసుకో వలసింది ఇంకా ఉందని శ్వేతకేతువుకు అప్పుడు మొదటిసారిగా తెలిసి వచ్చింది.

తన తండ్రినే ఆ జ్ఞానాన్ని గురించి వివరించమని అడిగాడు. "నదులు వేర్వేరు చోట్ల పుట్టినా చివరకు సముద్రాన్ని చేరుకుంటాయి. సూర్యరశ్మి వలన ఆ నీరు ఆవిరిగా మారి, మేఘంగా మారుతుంది. ఆ మేఘం వర్షించడం వలన నదులు ఏర్పడుతున్నాయి. ఆ నదులే మనకు ప్రాణభిక్ష పెడుతున్నాయి. మళ్ళీ ఆ నీరు సముద్రానికి చేరుకున్నాక, అంతా కలిసి పోవడం వలన, ఇది ఫలానా నది నీరు అని చెప్పలేము. అదే విధంగా జీవరాశులు పరమాత్మ నుంచి ఉద్భవించి చివరకు పరమాత్మనే చేరుతాయి. ఆ పరమాత్మ మనందరిలో ఆత్మ రూపంలో ఉంది. కాబట్టే మనల్ని జీవాత్మలు అంటారు. నీలోనూ ఆత్మ ఉంది కాబట్టి, ఆ పరమాత్మే నీవు (తత్త్వమసి)!" అని తండ్రి వివరించాడు.

శ్వేతకేతువు, "నాకు ఆ ఆత్మ గురించి మరింత వివరించండి" అని కోరాడు. తండ్రి అతణ్ణి ఒక మర్రికాయను తెమ్మని చెప్పాడు.

శ్వేతకేతువు, "ఇదిగో తెచ్చానండీ" అని తెచ్చి చూపాడు.

తండ్రి, "దాన్ని పగలగొట్టు!" అన్నాడు.

"ఆ! పగలగొట్టాను".

"ఏమి కనిపిస్తోంది?"

"చిన్న చిన్న గింజలు కనిపిస్తున్నాయండీ!"

"ఒక గింజను తీసుకుని పగలగొట్టు!"

ఆ గింజను కూడా పగలగొట్టాడు. శ్వేతకేతువు తండ్రి చెప్పినట్లే చేస్తున్నాడు కానీ, తండ్రి అలా ఎందుకు చేయిస్తున్నాడో అర్థం కాక లోలోపలే ఆశ్చర్యపోయాడు.

"ఏమి కనిపిస్తోంది?" తండ్రి తిరిగి ప్రశ్నించాడు.

"ఏమీ కనిపించడం లేదు!" అని సమాధానం చెప్పాడు.

తండ్రి మళ్ళీ వివరించడం మొదలుపెట్టాడు. "నీవు చివరిగా ఏమీ కనిపించడం లేదు!' అని సమాధానమిచ్చావు. అంటే ఏమిటి? అన్ని ఆకులతో, కొమ్మలతో, కాయలతో ఉన్న అంత పెద్ద మర్రిచెట్టు శూన్యంలో నుంచి పుట్టుకురాదు కదా! ఆ చెట్టు పుట్టుకురావడానికి కారణమైనదీ, నీ కళ్ళకు కనిపించనంత సూక్ష్మమైనదీ ఏదో ఉండి ఉండాలి కదా! శక్తి రూపంలో దానిలో దాగివున్న ఆత్మయే ఈ విధంగా జరిపిస్తోంది. మనలో ఉన్న ఆత్మ కూడా ఇదే విధంగా కంటికి కనిపించకుండా సూక్ష్మరూపంలో దాగి ఉంది. దానినే ఆత్మశక్తి అని కూడా చెప్పకోవచ్చు. కంటికి కనిపించ నంత మాత్రాన అది లేదని చెప్పవద్దు. నీలో కూడా ఆత్మ ఉంది కాబట్టి 'తత్త్వమసి! శ్వేతకేతూ!' (ఓ శ్వేతకేతూ! ఆ ఆత్మే నీవు!)'.

శ్వేతకేతువు ఆశ్చర్యం నుంచి తేరుకున్నాడు. విషయం అర్థం చేసుకున్నాడు. ఇంతలో తండ్రి కాస్త ఉప్పనూ, నీటినీ తీసుకురమ్మన్నాడు. శ్వేతకేతువు తీసుకువచ్చాడు. ఆ ఉప్పను నీటిలో వేసి కరిగించి, ఆ పైన ఆ నీటి రుచి ఎలా ఉందో చెప్పమని శ్వేతకేతువును అడిగాడు. తండ్రి చెప్ప దలచుకున్న విషయం మీద తీవ్రంగా ఆలోచిస్తున్న శ్వేతకేతువు ఆ నీళ్ళు ఉప్పగా ఉన్నాయని సమాధానం చెప్పాడు. "ఇప్పడు ఆ ఉప్ప ఈ నీటిలో ఎక్కడ ఉందో చెప్పగలవా?" అని తండ్రి ప్రశ్నించాడు. విషయం అర్థం అయిన శ్వేతకేతువు "నీటి మొత్తంలో ఉప్ప వ్యాపించి ఉంది" అని సమాధానం చెప్పాడు.

### మన మహోన్నత వారసత్వం

"ఇప్పడు ఆత్మ యొక్క సర్వవ్యాపకత్వం నీకు ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చింది కదా! ఆ ఉప్ప ఈ నీటిలో కరిగిపోయి, మొత్తం నీరంతా వ్యాపించి ఉన్నట్లు, సృష్టిలోని అన్ని వస్తువులలోనూ ఆత్మ వ్యాపించి ఉందని అర్థం చేసుకో! నీలోనూ ఆత్మ ఉంది కాబట్టి 'తత్త్వమసి! శ్వేతకేతూ!' (ఓ శ్వేతకేతూ!





ఆ ఆత్మే నీవు!)" అని తండ్రి వివరించాడు.

ఇప్పడు శ్వేతకేతువు ఒక అడుగు ముందుకువేసి, "నాన్నగారూ! మీరు చెప్పిన ఉపమానాలతో నాకు విషయం అర్థం అయింది. ఆత్మను తెలుసుకోవడం సులభమేనని అనిపిస్తోంది. కానీ, ఆ ఆత్మ నిజంగా మన అనుభవంలోకి వస్తుందా? అసలు ఆత్మానుభూతిని పొందడం ఎలా?" అని ప్రశ్నించాడు.

ఉద్దాలక మహర్షి ఇలా వివరించాడు. "ఓ శ్వేతకేతూ! ఆత్మానుభవానికి మార్గం ఎలా ఉంటుందో కూడా ఒక ఉపమానంతోనే చెపుతాను. ఒక మనిషి కాళ్ళూ చేతులూ కట్టివేసి, కళ్ళకు గంతలు కట్టి అరణ్యంలో వదలివేశారనుకో! అప్పడు అతడు ఏం చేస్తాడు? కదలలేక, దారి కానరాక గిలగిలా కొట్టుకుంటాడు. సహాయం కోసం ఎలుగెత్తి అరుస్తాడు. ఎవరో తప్పక వస్తారు. కళ్ళ గంతలు తీసి త్రోవ చూపెడతారు. ఆ త్రోవలో ప్రయాణిస్తూ, మధ్యమధ్యలో దారి కనుక్కుంటూ అతడు తన స్వగృహానికి చేరుకుంటాడు. అలాగే అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్న మనం ఆత్మ కావాలన్న తపనతో ప్రయాస పడాలి. అలా చేస్తే సహాయం తప్పక లభిస్తుంది. అది ఎలాగైనా రావచ్చు. ఎక్కడ నుంచైనా రావచ్చు. అటువంటి సహాయం లభించాక మనకు చూపబడిన త్రోవలో పట్టువదలకుండా ప్రయాణించాలి. అప్పడే గమ్యానికి చేరుకోగలం!"

ఈ విధంగా ఉద్ధాలకుడు ఆత్మ అంటే ఎక్కడో ఆకాశంలో లేదనీ, మనలోనే ఉన్నదనీ, మన నిజతత్త్వం ఆత్మతత్త్వమేననీ చిన్న చిన్న ఉదాహరణలతో వివరించాడు. ఉద్ధాలకుడు చెప్పిన ఈ 'తత్త్వమసి' (తత్-త్వం-అసి అంటే అదే-నీవు-అయి వున్నావు) అనే వాక్యాన్నే వేదాంత పరిభాషలో మహావాక్యంగా పరిగణిస్తారు.



# ఆశ్రమ భిక్ష పథకం
# అన్నదాన పథకం



శ్రీ సాయీ సేవా సమితి వారి ఆశ్రమం "సాయిధామం"లో అన్నదాన పథకం నడుస్తున్నది. అన్ని దానాల్లోకి అన్నదానం పుణ్యప్రదమని పెద్దలంటారు. శ్రీ సాయికి అన్నదానాలు చాలా ప్రీతిపాత్రం. ఆకలిగొన్న ఎవరికి అన్నం పెట్టినా అది నాకే చెందుతుందని బాబా కంఠోక్తిగా చెప్పారు. తను మాత్రమే వండుకొని తినడం పాపమని గీత చెప్పింది. అన్న దానాన్ని మించిన దానం లేదని అన్ని శాస్త్రాలు అంటున్నాయి. అందుచేత సాయి భక్తులైన వారికి యీ పుణ్యప్రదమైన అవకాశం కల్పించటం కోసం ఈ పథకం రూపొందింపబడింది.

సభ్యత్వంగా రూ.6,116/-లు చెల్లించిన వారు యీ పథకంలో సభ్యులవుతారు. సంవత్సరానికొకసారి చొప్పున వారి పేరిట (వారు కోరిన తేదీన గోత్ర నామాలతో) శ్రీ సాయి అర్చన జరుగుతుంది. అదేరోజు వారి పేరిట ఆశ్రమంలో "భిక్ష" ఏర్పాటు చేయబడుతుంది. దీంట్లో వారు స్వయంగా కూడా పాల్గొనవచ్చు. ఆ రోజు వారిపేరు భోజనశాలలో బోర్డు మీద వ్రాయటం ద్వారా ప్రకటితమవుతుంది. సభ్యత్వపు రుసుము **"శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు"** పేరిట చెక్కుల ద్వారాగానీ, వ్యక్తుల ద్వారా గానీ పంపవచ్చు. సత్సంగాలలోనైనా యివ్వవచ్చు. ఈ పథకంలో చేరేవారు తమ చిరునామా, ఎవరి పేరుమీద జరగాలో వారి వివరాలు, చిరునామా, మొబైల్ ఫోన్ నెంబర్లు కూడా వ్రాసి పంపాలి.

సాయి బంధువులారా,

మీ పిల్లల జన్మదినాల పేరిటో, మీ వివాహ వార్షికోత్సవాల పేరిటో, గతించిపోయిన పెద్దల పేరిటో, మీ గురుదేవుల పేరిటో యీ పథకంలో మీరు భాగస్వాములు కండి. మీకు తెలిసిన వారికి కూడా యీ విషయం తెలియజేయండి. ఆకొన్నవారి కడుపునింపి శ్రీ సాయినాథుల అపార కరుణకు పాత్రులు కండి. చిరునామా సాయివాణిదే.

**సాయిధామం,**
**శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్,**
**రామలింగంపల్లి పోస్టు, యాదాద్రి భువనగిరి జిల్లా-508126**





# సాధకులకు ఆహ్వానం

సాయిధామం సేవాశ్రమం ఒక యతీశ్వరుడు నడయాడిన చోటు. ముప్పై ఏళ్ళుగా నిరంతర సత్సంగాలు నడుస్తున్న తావు-శ్రీ సాయినాథుల వారికన్నా ముందరే వారెక్కడ ప్రతిష్ఠింపబడాలో తామే లిఖితపూర్వకంగా చూపిన ఆలయం- పూలతోటలాంటి చక్కని పాఠశాల, ఆనందోత్సాహాలతో తిరిగే శిశుమందిరం వంటివి ఉన్న 33 ఎకరాల వైశాల్యం ఉన్న ప్రదేశం. అలాంటి యీ - సాయిధామంలోని వానప్రస్థాశ్రమం ప్రశాంతి. ఆధ్యాత్మిక చింతన, కొంతయినా సేవాదృక్పథం ఉన్న - 50 సం॥ పైబడిన 75 సం॥ దాటని వారు ఎవ్వరికైనా సాదరంగా స్వాగతం పలుకుతుంది.

## ఆశ్రమం కల్పించేవి

❖ చక్కని ప్రశాంత ప్రకృతి సహజ వాతావరణం.
❖ సాత్త్వికమైన అల్పాహార, భోజనాలు.
❖ నిత్య సత్సంగం.
❖ కులభేదాలు లేని సమభావం.
❖ ఉదయం, సాయంకాలం యోగ
❖ సాయిబాబా, దత్త దేవాలయాలు, భారతమాతల నిత్య సందర్శనభాగ్యం.
❖ మంచి గ్రంథాలయం. ❖ గోశాల ❖ ప్రకృతి వైద్యం

## ఆశ్రమంలో చేరదలచుకొన్నవారి బాధ్యతలు

❖ ఆశ్రమ ప్రశాంతతకు అనుగుణంగా ఉండటం.
❖ సేవా కార్యక్రమాలకు చేతనైనంతగా సహకరించడం

**సాయిధామం ఆశ్రమంలో చేరదలచిన వారు దిగువ ఇచ్చిన ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు :**

**ఫోన్స్ : 9848133565, 9440413455**